క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



ఏర్పేడు: తహసీల్దారుగా ద్వారకనాథ్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ఉదయ్ సంతోష్ కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. కేవీబీపురం నుంచి ద్వారకనాథ్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

హెచ్‌ఎంగా నిర్మల్‌కుమార్

ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడిగా నిర్మల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి హెచ్‌ఎం వెంకటరమణ రేణిగుంట మండలం ఆర్.మల్లవరానికి బదిలీపై వెళ్లారు.

ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు

పిచ్చాటూరు: పిచ్చాటూరు ఎస్‌ఐగా సి.వెంకటేశ్వర్లును నియమిస్తూ జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డిని సత్యవేడు-2కు బదిలీ చేశారు. నూతన ఎస్‌ఐ బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

జీవ భాగీ దారిపై అవగాహన ర్యాలీ



నాగలాపురంలో అవగాహన ర్యాలీ

పిచ్చాటూరు: జీవ భాగీదారిపై పిచ్చాటూరు, నాగలాపురం సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిచ్చాటూరు మండలం గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. జీవ భాగీదారి గురించి తెలియజేశారు. దీనిని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మరియమ్మ, సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్త భారతి, హెల్పర్లు పాల్గొన్నారు.

దేవులపల్లి అమర్ రాక



అమర్‌కు స్వాగతం పలుకుతున్న బాలకొండయ్య

రేణిగుంట: జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్‌కు సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. రెండు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం వచ్చిన ఆయనకు ఎయిర్‌పోర్ట్‌లో జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబసమేతంగా తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు.

ఇద్దరిపై కేసు

ఏర్పేడు: ఓ మహిళను దుర్భాషలాడి దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి సోమవారం రాత్రి తెలిపారు. మండలంలోని మర్రిమందకు చెందిన చిట్టెమ్మను ఇంటి స్థల వివాదం విషయమై గ్రామానికి చెందిన మనోజ్ ఆచారి, జయంతు ఆచారి ఆదివారం అసభ్య పదజాలంతో దుర్భాషలాడి దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా చేయాలి



మాట్లాడుతున్న సీడీపీఓ క్రిష్ణమంజరి

రేణిగుంట: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలనిని రేణిగుంట సీడీపీఓ క్రిష్ణమంజరి అన్నారు. రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతనంగా ఏర్పాటు కావడంతో ఆమె సోమవారం రేణిగుంట, ఏర్పేడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. వైఎస్సార్ పోషణ యాప్, పోషణ ట్రాక్‌లో చేయాల్సిన పని గురించి వివరించారు. గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే పౌష్టికాహారం పంపిణీని జూలై నుంచి పునరుద్ధరించాలన్నారు.

వ్యర్థాలు, చెత్త తొలగింపు

ఏర్పేడు: తిరుపతి-శ్రీకాళహస్తి ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పేడులో ఉన్న వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య సోమవారం జేసీబీతో తొలగించారు. ప్రజలు వ్యర్థాలను రోడ్లపై విచ్చలవిడిగా వేయరాదని, గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈఓపీఆర్డీ మురగయ్య, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ వద్ద బస్సు ప్రమాదం

తిరుమల: కారును తప్పించబోయి ఆర్టీసీ బస్సు రక్షణ గోడను ఢీకొన్న సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. మంగళం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి తిరుమలకు ప్రయాణికులతో బయలుదేరింది. వీరి వాహనం జీఎన్‌సీ టోల్ గేట్ వద్దకు వస్తుండగా ముందుగా ఉన్న కారు అకస్మాత్తుగా బస్సులు వెళ్లే మార్గంలోకి రావడంతో కారును తప్పించబోయి బస్సు ప్రమాదానికి గురైంది.

విద్యకు స్వర్ణయుగం

- జగనన్న విద్యాకానుక పంపిణీలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



కేవీబీపురం మండలంలో విద్యాకానుక పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: చదువు విలువ తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విద్యారంగానికి స్వర్ణయుగం నడుస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక, యూనిఫామ్‌ను లాంఛనంగా ఎమ్మెల్యేతోపాటు జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్కూళ్ల పునఃప్రారంభం రోజునే పుస్తకాలను ఇస్తున్న ఘనత సీఎంకే దక్కిందన్నారు. తల్లిదండ్రులకు భారం కారాదనే ఉద్దేశంతో విద్యాకానుక అందిస్తూ, వారి భవితకు బాటలు వేస్తున్నారన్నారు. కార్పొరేట్ స్కూళ్లకంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడుతో తీర్చిదిద్దారని, అంతేకాకుండా మినరల్ వాటర్ వాటర్, డెస్కులు, డిజిటల్ క్లాస్‌రూములు, లైబ్రరీ ఏర్పాటుతో దేశం మొత్తాన్ని ఆకర్షించే స్థాయిలో మన విద్యావ్యవస్థను సీఎం తీర్చిదిద్దారన్నారు. విద్యాకానుక పంపిణీకి పిల్లల తల్లిదండ్రులను ఎందుకు ఆహ్వానించ లేదని ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి విద్యాకానుక కిట్లను అందజేయాలని ఎంఈఓ భారతిని ఆదేశించారు. అనంతరం సుమన్‌కుమార్, ఎంపీపీ మాట్లాడారు. పదో తరగతి ఫలితాల్లో మండల విద్యార్థులు జిల్లా స్థాయిలో పదింట మూడు స్థానాలను కైవసం చేసుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ ఏడాది నుంచి నారాయణవనంలో ప్రారంభమైన బాలికల జూనియర్ కళాశాలకు ఏడు గురు అధ్యాపకులను ప్రభుత్వం మంజూరు చేసిందని, 36 మంది జూనియర్ ఇంటర్‌లో చేరారని హెచ్‌ఎం శశికళ తెలిపారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్, భాస్కర్‌బాబు, పార్టీ నాయకులు



నారాయణవనం : విద్యాకానుక కిట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

చిన్నదొరై, చీరాలయ్య, బాలసుబ్రమణ్యం, శివకుమార్, శంకరయ్య, మణిరెడ్డి మనోహన్, మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: స్థానిక ఆదర్శ పాఠశాల, కేవీబీపురం జెడ్పీ హెచ్‌ఎస్, రాగిగుంట హైస్కూల్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సందర్శించారు. విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. పార్టీ మండల పార్టీ కన్వీనర్ గవర్లకృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, స్టేట్ ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ ధనుంజయరెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, నేతలు నందకుమార్, లాల్‌బాబు యాదవ్, మూర్తి సుబ్బన్న, హరిబాబురెడ్డి, అరుల్ తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: మండలంలోని 69 పాఠశాలల్లో 4,396 మంది విద్యార్థులకు జేవీకే కిట్లను పంపిణీ చేసినట్లు ఎంఈఓ సరస్వతి తెలిపారు. గోవర్ధనపురం హైస్కూల్‌లో జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ అబ్దుల్, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు గున్నయ్య, పాండూరు హైస్కూల్‌లో ఎంపీటీసీ సామర్ల భువనేశ్వరి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ నాగూర్ బాషా, వైస్ చైర్మన్ సురేష్ చేతుల మీదుగా హెచ్‌ఎం విమలకుమారి విద్యాకానుక కిట్లను అందజేశారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు, పల్లమాల జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యాకానుక కిట్లను ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్, గాయత్రిదేవి పంపిణీ చేశారు. విద్యా కానుక కింద ప్రతి విద్యార్థికి మూడు జతల బట్టలు, ఒక జత షూ, బెల్టు, బ్యాగు, డిక్షనరీ, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నారని తెలిపారు. పల్లమాల సర్పంచ్ రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్‌రెడ్డి, కల్లివెట్టు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు, నాగలాపురంలో..

పిచ్చాటూరు: పిచ్చాటూరు, నాగలాపురం మండలాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంఈఓ హేమమాలిని, నాగలాపురం ఎస్ఎస్ పురంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ అధ్వర్యంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. పిచ్చాటూరు ఈఓపీఆర్‌డీ శ్రీదేవి, ఎస్ఎస్ పురం హెచ్‌ఎం గోపి, సర్పంచ్ క్రిష్ణమశెట్టి, టీచర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.





వరదయ్యపాళెం : పాండూరు హైస్కూల్‌లో.., బీఎన్‌కండ్రిగ: పల్లమాలలో..





నాగలాపురం ఎస్ఎస్ పురం జెడ్పీ హైస్కూలులో.., శ్రీకాళహస్తి : జెడ్పీ బాలుర హైస్కూలులో..



తొట్టంబేడు: పెద్దకన్నలిలో..



ఏర్పేడు : ఎండీపుత్తూరులో..



నారాయణవనం బాలుర ఉన్నత పాఠశాలలో..

నారాయణవనంలో..

నారాయణవనం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డితో కలిసి విద్యాకానుక పంపిణీ చేశారు. పదవ తరగతిలో మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులను అందజేస్తానని సుమన్ ప్రకటించారు. కార్యక్రమంలో చిన్నదొరై, హెచ్‌ఎం భాస్కర్ బాబు, పాఠశాల కమిటీ చైర్మన్ శరవణ రెడ్డి, ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుర జెడ్పీ హైస్కూలులో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూలులో విద్యాకానుక కిట్లను తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్కాడ్ శంకర్ పంపిణీ చేశారు. తొలుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యక్షప్రసారాన్ని విద్యార్థులు టీవీలో వీక్షించారు. ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): మండలంలోని 27 పంచాయతీలలోని 60 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 12 జెడ్పీ హైస్కూళ్లలో చదువుతున్న 3,742 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను సోమవారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు, విద్యాకమిటీ చైర్మన్లు, సర్పంచులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: ఏర్పేడు జెడ్పీ హైస్కూలులో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, ఎండీపుత్తూరు, చిందేపల్లె ప్రాథమిక పాఠశాలల్లో సర్పంచ్‌లు మోహనప్రియ, పెంచలయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు సునీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ అందుతున్నాయని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని టీఎంవీకండ్రిగ సచివాలయం పరిధిలోని చుక్కలనిడిగల్లు గ్రామ పంచాయతీ ఎస్టీ కాలనీలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆయా తీశారు. అర్హత ఉన్నప్పటికీ పథకాలు అందని వారు పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి రాబోవు ఎన్నికల్లోనూ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో అమ్మపాళెం మాజీ సర్పంచ్ కందాటి రాఘవరెడ్డి, సర్పంచ్ చుక్కల కిరణ్, చుక్కల ఎల్లయ్య, ప్రవీణ్, మహేష్, శంకర్, శంకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, లీలా, శంకర్, చంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మునికృష్ణ, నవీన్,రఘు, కేశవరెడ్డి తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం షికారీల ఆందోళన



ఆందోళన చేస్తున్న షికారీలు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు సమీపంలో నక్కలమిట్ట వద్ద నివాసముంటున్న షికారీలు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తమ ఇబ్బందుల గురించి ఎన్నోసార్లు అధికారులకు నివేదించినా పట్టించుకోలేదని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ గౌరిశంకరరావుకు వినతి పత్రం ఇచ్చారు. తహసీల్దార్ హామీతో ఆందోళన విరమించారు.

సామాన్య భక్తులకే పెద్దపీట

- పాలకమండలి సమావేశంలో 48 అంశాలపై ఆమోదం
- చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు



మాట్లాడుతున్న పాలక మండలి చైర్మన్ అంజూరు, పక్కన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తామని పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సమావేశం సోమవారం ఆలయ పరిపాలన భవనంలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు.ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో 48 అంశాలకు సంబంధించిన అజెండాపై చర్చించారు. మండలి సమావేశం అనంతరం పాలకమండలి చైర్మన్ విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే సలహాలు-సూచనలతో ధర్మకర్తల మండలి పలు కీలక అంశాలను ఆమోదించిందన్నారు. స్వర్ణముఖి నది కలుషితం కాకుండా పట్టణంలో మురుగునీరు పైపులైను ద్వారా తరలించే పథకానికి ఆమోదించినట్లు వెల్లడించారు. ప్రొటోకాల్ వీఐపీలకు నిర్దిష్ట సమయంలో దర్శనం ఏర్పాటు చేసే అంశాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక భక్తులకు రోజూ రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అంతరాలయ దర్శనం త్వరలో కల్పిస్తామని, అలాగే ఉదయం నుంచి రాత్రి 7గంటల వరకు అంతరాలయ దర్శనానికి రూ.500 టికెట్ ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ప్రధాన ఆలయంలో లీకేజీల నివారణకు సంబంధించి రూ.3కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, దాత సహకారంతో ఈ పనులు చేయనున్నట్లు తెలిపారు. కాశీవిశ్వనాథస్వామి ఆలయ లీకేజీలు కూడా నిరించి ఆధునీకరణ పనులు చేయనున్నట్లు తెలిపారు. రామసేతు వంతెన, కొత్త వంతెన మధ్య ఖాళీస్థలంలో దక్షిణామూర్తి విగ్రహాన్ని, ఏపీ సీడ్స్ సర్కిల్‌లో . ధ్యానమూర్తి శివయ్య విగ్రహం ఆకర్షణీయంగా ఏర్పాటు చేస్తామన్నారు. గురు దక్షిణామూర్తి బ్రహ్మోత్సవాలను పునరుద్ధరించాలని చర్చించినట్లు తెలిపారు. ఆలయంలో ఉద్యోగుల అంతర్గత బదిలీలు ధర్మకర్తల మండలి అనుమతితో మాత్రమే చేయాలని తీర్మానించారు. ప్రముఖులను ఆశీర్వదించడానికి ఇకపై ప్రత్యేకంగా ఆశీర్వాద మండపం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గిరి ప్రదక్షిణ మార్గంలో సోలార్ లైట్ల ఏర్పాటు, ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పన అంశాలను ఆమోదించినట్లు తెలిపారు. హరితాభివృద్ధి పథకంలో మరో 25మందిని కొత్తగా తీసుకోనున్నట్లు చెప్పారు. నిత్యాన్నదాన మండపంపై మరో సెల్లార్ ఏర్పాటు చేసి ఒకే విడత వెయ్యిమందికి అన్నదానం చేస్తామన్నారు. విజ్ఞానగిరి వద్ద గణపతి మండపం నిర్మాణాన్ని విస్తరిస్తామన్నారు. అమ్మవారి నవ్వాల మండపం పునర్నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు సాధన మున్నారాయల్, బుల్లెట్ జయశ్యామ్, కొండూరు సునీత, పసల సుమతి, రమాప్రభ, లక్ష్మి, మహీధర్‌రెడ్డి, పెద్దిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, దాసరి జయమ్మ, ప్రత్యేక ఆహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, చింతామణి పాండు, పాలమంగళం నీలా, శ్రీదేవి, శోభ, మీనాక్షి, పలువురు ఆలయ అధికారులు, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వరదయ్యపాళెం/బుచ్చినాయుడుకండ్రిగ: వరదయ్యపాళెం హైస్కూల్, బీఎన్ కండ్రిగ హైస్కూళ్లలో మంగళవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తారని ఎంఈఓ సరస్వతి, పార్టీ మండల కన్వీనర్ ఆరణి విద్యాధరరెడ్డి తెలిపారు. అలాగే వేణుగోపాలపురంలో ఇళ్లపట్టాలను పంపిణీ చేస్తారని ఆరణి చెప్పారు.

14న పూతలపట్టులో జాబ్‌మేళా

రేణిగుంట: పూతలపట్టు మండలం పేటమిట్టలోని అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఈనెల 14న ఉదయం 10 గంటలకు పూతలపట్టు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అమరరాజ యాజమాన్యం తెలిపింది. టెన్త్, ఇంటర్ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఎంపికైన వారికి మల్టీ స్కిల్ టెక్నీషియన్ కింద 2 సంవత్సరాలు శిక్షణ ఇస్తామని, శిక్షణానంతరం మూడు నెలలు హాస్టల్, భోజన వసతి కల్పించి, రూ.7500 స్టైఫండ్ ఇస్తామని, తదుపరి కంపెనీలో ఉద్యోగ శిక్షణకు తీసుకున్నాక రూ.11,640 వేతనం ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇతర వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు : 9000024919, 9100477371

హెల్మెట్ వాడకంపై అవగాహన

పిచ్చాటూరు: హెల్మెట్ వాడకంపై ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ద్విచక్ర వాహనదారులకు సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకపోవడం వల్ల ప్రమాద సమయాల్లో తలకు గాయమై ప్రాణాలు పోయే పరిస్థితి వస్తుందన్నారు. హెల్మెట్ ఉంటే తల భాగం సురక్షితంగా ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మోటార్ సైక్లిస్టులు విధిగా హెల్మెట్ వాడాలని ఆయన కోరారు.

గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోండి



వినతిపత్రం ఇస్తున్న ఉజ్వల్ రెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్‌రెడ్డి, తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. బత్తలవల్లం పెద్ద చెరువు నుంచి నిత్యం వందలాది లారీల ద్వారా తమిళనాడుకు గ్రావెల్ తరలిస్తున్నారని, స్థానిక రైతుల అవసరాలకు మినహా రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అనుమతులు ఇవ్వరాదని కోరారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గౌరిశంకరరావు హామీ ఇచ్చారు.

నేడు సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురు దక్షిణామూర్తి సన్నిధిలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఈవో సాగర్‌బాబు తెలిపారు. చిన్నారులను తల్లిదండ్రులు ఉదయం 8గంటలకు ఆలయంలోని మేధో దక్షిణామూర్తి వద్దకు తీసుకుని రావాలని కోరారు.

ముక్కంటి సేవలో..



గోపూజలో సూర్య ప్రకాశనంద మహారాజ్‌స్వామి

శ్రీకాళహస్తి: అసోం రాష్ట్రం గౌహతి కామాఖ్యే ఆలయ అర్చకులు సూర్యప్రకాశనంద మహారాజ్ స్వామి సోమవారం గోపూజలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. తాను పుట్టింది ఒంగోలు జిల్లా అద్దంకి అని ఆయన తెలిపారు. ఒట్టిపోయిన ఆవుల సంరక్షణకు గోశాలలు ఏర్పాటు చేయాలనే సంకల్పంలో భాగంగా శ్రీకాళహస్తికి విచ్చేశానన్నారు. రోడ్లపై తిరుగుతున్న గోవులు, బక్కచిక్కి శల్యమైపోయిన గోవులను సంరక్షించాలన్నదే తన ఉద్దేశమని, ఇదే విషయాన్ని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లామన్నారు. పూర్తి వివరాలతో వినతి పత్రం ఇస్తే పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విశ్వనాథ్ అన్నారు. బాల కార్మిక నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పిల్లలందరూ పనిలో కాదు బడిలో ఉండాలన్నారు. 14ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది మీర్జావలి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రంగనాథం, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ప్రభుత్వం అండ



సమావేశమైన ముస్లిం నాయకులు

శ్రీకాళహస్తి: మైనార్టీలకు అండగా ఉంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని తిరుపతి జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా కోరారు. సోమవారం పట్టణంలోని మజీద్ - ఏ - హుదా కమిటీ సభ్యులను కలిశారు. 'హర్ దిల్ మే వైఎస్సార్...' కార్యక్రమం గురించి ముస్లింలకు తెలియజేశారు. సమస్యలపై ఆరా తీశారు. రానున్న ఎన్నికల్లో మైనార్టీలు జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బావాజీ, ఉస్మాన్, మౌలానా మహబూబ్‌బాషా, అమీర్‌బాషా, కలీం, చానా, రఫీ, గౌస్ మొహియుద్దీన్ పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు



విజయసాయిరెడ్డిని సన్మానిస్తున్న జిల్లా సేవాదళ్ అధ్యక్షులు ఢిల్లీ బాబురెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ వి.విజయసాయిరెడ్డిని తిరుపతి జిల్లా వైస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు కాపిరెడ్డి ఢిల్లీబాబురెడ్డి కలిశారు. సోమవారం తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ విభాగ రాష్ట్ర అధ్యక్షుల, జోనల్ ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీ బాబురెడ్డి ఆయనను కలిసి సన్మానించారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి, అమ్మవార్లు ప్రసాదాలను అందజేశారు.

కారిపాకంలో ఉపాధి పనులు ప్రారంభం



కారిపాకంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

వరదయ్యపాళెం: అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతిని సస్పెండ్ చేయడంతో గత 20 రోజులుగా ఆగిన ఉపాధి పనులు సోమవారం నుంచి పునః ప్రారంభించినట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు తెలిపారు. ఈ విషయమై ఈ నెల 10న సాక్షిలో «కారిపాకంలో ఆగిన ఉపాధి పనులు» అన్న కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీఓ, ఉపాధి ఏపీఓ భాస్కర్, కారిపాకంలో సమస్య గురించి స్థానిక ఉపాధి కూలీలతో చర్చించారు. సీనియర్ మేట్ ఆధ్వర్యంలో పనులను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు.